క్లుప్తంగా

156 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నరసన్నపేట: స్థానిక కల్వరి బాప్టిస్టు మినిస్ట్రీస్ చర్చిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 156 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీకాకుళం మెడీ కవర్ ఆస్పత్రి సహకారంతో భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్, కల్వరి బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జిల్లా ఉమెన్ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్న డేవిడ్, బీహెచ్ఆర్సీ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ డేనియేల్ సూరాడ, సుందరరావు, జాన్ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణసాయం అందజేత



తక్షణసాయం అందజేస్తున్న శివానందమూర్తి

సరుబుజ్జిలి: వీరమల్లిపేట గ్రామానికి చెందిన గుడే శంకరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని భార్య నాగమణికి వైఎస్సార్ బీమా తక్షణసాయం కింద రూ.10 వేలను మండల పరిషత్ ఉపాధ్యక్షుడు జి.వి.శివానందమూర్తి మంగళవారం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, సచివాలయం ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

హిరమండలం: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని ఐటీడీఏ ఎన్ఎఫ్ఏ ముసలయ్య అన్నారు. మండలంలోని కిట్టాలపాడు, కొండరాగోలు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేస్తున్న పంట పొలాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి రసాయనాలు, ఎరువులు వినియోగించకుండా పూర్తిగా ప్రకృతి వనరులతో సాగు చేపడితే పంటల దిగుబడి కూడా సాధ్యమవుతాయన్నారు. అటువంటి ఆహారం బలవర్ధకమని వివరించారు. అందుకే రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా అవగాహన పెంచాలని సూచించారు. ఎంటీ సూర్యనారాయణ, యూనిట్ ఇన్‌చార్జిలు లత, రాములమ్మ, ఐసీఆర్పీలు జోగారావు, ఢిల్లీ, శ్రీను, దమయంతి, తేజ తదితరులు పాల్గొన్నారు.

జనరిక్ మందుల షాపు ప్రారంభం



జనరిక్ మందుల షాపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

కొత్తూరు: ప్రజారోగ్యానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొత్తూరులో స్థానిక పీఏసీఎస్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధ కేంద్రాన్ని (జనరిక్ మందుల షాపు) మంగళవారం ప్రారంభించారు. కొత్తూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి నగేష్, డీఆర్ఓ మురళీకృష్ణ పాతపట్నం సబ్ డివిజనల్ ఆఫీసర్ జయలక్ష్మి, సంఘం సీఈఓ పిన్నింటి రవిరాజా, కొత్తూరు సర్పంచ్ పడాల కృష్ణవేణి, ఏఎంసీ చైర్మన్ సారిపల్లి నిరూష, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, కలమట రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కామక భాగ్యవతి, పారాపురం సర్పంచ్ కుంచాల రత్నాలు, హిరమండలం, మెళియాపుట్టి పీఏసీఎస్ చైర్మన్లు సురేష్, బాలరాజు, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు లోతుగెడ్డ తిరుపతిరావు, పీఏసీఎస్ డైరెక్టర్ గార రాజులునాయుడు పాల్గొన్నారు.

జీవన ఎరువుల తయారీపై అవగాహన

ఆమదాలవలస రూరల్: చెరకు పంట వ్యర్థాలతో మేలైన పోషక జీవన ఎరువును తయారు చేసుకోవచ్చునని మండల ప్రకృతి వ్యవసాయ రిసోర్స్ పర్సన్ నక్క చిరంజీవి అన్నారు. మండలంలో నిమ్మతొర్లాడ గ్రామంలో పోషక జీవన ఎరువు తయారీపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చెరకు పంట, బెల్లం తయారీ విధానంలో వచ్చే వ్యర్థాలతో నేలకు అందించే పోషక ఎరువులను సులువుగా తయారు చేసుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో మేలైన జీవన ఎరువుల వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. భూమిని సారవంతం చేసేందుకు ఈ పద్ధతులను రైతులందరూ పాటించాలని సూచించారు.

పదవీ కాలం పొడిగింపుపై హర్షం

మెళియాపుట్టి: మండలంలోని సంతోషపురం గ్రామానికి చెందిన సవర ఈశ్వరమ్మ రాష్ట్ర ట్రైకార్ డైరెక్టర్‌గా రెండేళ్ల పదవీకాలం ముగిసింది. ఆమె పదవీకాలాన్ని పొడిగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. తాడేపల్లిలోని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చేతులమీదుగా ఉత్తర్వుల ప్రతిని అందుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, రెడ్డి శాంతికి కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు ఆర్థిక భరోసా



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళా పక్షపాతి అని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఆసరా ఉత్సవాల్లో భాగంగా ఉర్లాంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఒక్క ఆసరా పథకం ద్వారా మండలంలోని 17,932 మంది మహిళలకు రూ.45.65 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని గుర్తుచేశారు. 2019 ఏప్రిల్ 11 నాటికి మహిళా సంఘాలకు ఎంత రుణం ఉంటే దానిని పూర్తిగా మాఫీ చేస్తానని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాట ఇచ్చారని, దాని ప్రకారం ఒక్కో విడతలో రూ.11.41 కోట్ల మేరకు మాఫీ చేసుకుంటూ వచ్చామన్నారు. మళ్లీ జగనన్న సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు రానున్నాయని, ప్రజలను నమ్మించి మోసం చేయడానికి టీడీపీ నాయకులు వస్తున్నారని, గత టీడీపీ హయాంలో ఏం చేశారో ప్రశ్నించాలన్నారు. పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ మహిళలకు టీడీపీ మోసం చేస్తే.. ముఖ్యమంత్రి జగనన్న ఆదుకున్నారన్నారు. టీడీపీ వస్తే ప్రజలకు మేలు జరగదని, ఆ పార్టీ నాయకులకే మేలు జరుగుతుందని, దీనిని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. నరసన్నపేట జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణ, ఎంపీపీ ఆరంగి మురళి, ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, పార్టీ నాయకులు బార్ల వేణుగోపాలరావు, రాజాపు అప్పన్న, సురంగి నర్సింగరావు, లుకలాపు రవి, యాబాజి రమేష్, పుట్టా ఆదిలక్ష్మి, పాగోటి గోవిందరావు తదితరులు ప్రసంగించారు. సీఎం జగన్ చిత్రపటానికి మహిళలతో కలిసి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పొందరి కార్పొరేషన్ చైర్ పర్సన్ హైమావతి, పార్టీ నాయకులు చింతు రామారావు, పొన్నాన దాలినాయుడు, నడిమింటి శాంతారావు, రమణయ్య, ఏసీ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



ఆసరా సభకు హాజరైన మహిళలు

ఎంతో మేలు జరిగింది



జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా కుటుంబం ఎంతో ప్రయోజనం పొందింది. ఆసరా సొమ్ముతో పొలం అభివృద్ధి చేసుకున్నాం. ఆ పొలంలో ఇప్పుడు పంటలు పండించి జీవనోపాధి మెరుగుపరచుకున్నాం. మా కుమార్తెకు అమ్మఒడి వస్తుంది. పాపను బాగా చదివించుకుంటున్నాం. జగనన్న ఇల్లు మంజూరైంది. ఇల్లు నిర్మించుకున్నాం. గతంలో ఎన్నో ఇబ్బందులు పడ్డాం. జగనన్న వచ్చాక మా కష్టాలు అనేకం తీరాయి. జగనన్నకు ఓటు వేసి, చుట్టు పక్కల వారితో కూడా వేయించి రుణం తీర్చుకుంటాం.

– ముంగి కృష్ణవేణి, ఉర్లాం

‘స్వచ్ఛ’మైన జీవనం అలవాటు చేసుకోవాలి



చెత్త సేకరణ బుట్టలను పంపిణీ చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

- స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాన్ని నిలబెట్టాలని ప్రజలకు స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తడిచెత్త, పొడిచెత్త ఏరివేతకు అవసరమైన బుట్టలను పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం అందజేశారు. స్వచ్ఛమైన జీవనం అలవాటు చేసుకోవాలని, అందుకు ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తబుట్టలను వినియోగించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరుచేసే ప్రక్రియ గ్రామాల్లో ఇప్పటికే ఉద్యమంగా నడుస్తోందన్నారు. ప్రతి ఇంటికీ గ్రీన్‌అంబాసిడర్లు వచ్చి చెత్తను సేకరిస్తున్నారన్నారు. ప్రతీ ఇళ్లు, పరిసర ప్రాంతాలు, గ్రామాలు క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ సభ్యుడు లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్‌కుమార్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, నాయకులు వండాన వెంకటరావు, కాకర్ల రాజారావు, గార రమణ, పెద్దింటి రవి పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ప్రభుత్వ వైద్య సేవలు

ఎల్.ఎన్.పేట: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ప్రజల వద్దకు ప్రభుత్వ వైద్యాన్ని తీసుకువచ్చారని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, బొర్రంపేట ఎంపీటీసీ సభ్యుడు కింతలి చిరంజీవి అన్నారు. బొర్రంపేట గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. పలువురికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గ్రామ సర్పంచ్ బొడ్డేపల్లి రమణమ్మ, ఈఓపీఆర్డీ ఐ.పద్మజ, తురకపేట ఆస్పత్రి వైద్యులు లక్షదీప్, నీతూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

409 మందికి వైద్య పరీక్షలు

సారవకోట: మండలంలోని బద్రి సచివాలయ ఆవరణలో మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 409 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. సారవకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బందితోపాటు ప్రత్యేక వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఎంపీడీఓ రాంబాబు, ఈఓపీఆర్డీ రేణుక, పంచాయతీ కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: పొందూరులో రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. పొందూరు సీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్ కుమార్, తాడివలస పీహెచ్‌సీ వైద్యాధికారులు నవీన్, సుజాత, రమేష్‌నాయుడులు రోగులకు వైద్య సేవలందించారు. 312 మందికి పరీక్షలు చేపట్టి అవసరమైనవారికి మందులు అందజేశారు.

గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



యంత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి, అడిషనల్ పీడీ జయరాం

- యంత్రాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

మెళియాపుట్టి: గిరిజనుల ఆర్థికపురోభృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని దీనబంధుపురం పంచాయతీ పరిధి కుద్దబ గ్రామంలో వాటర్ షెడ్ ద్వారా వచ్చిన పంపుసెట్లు, వాటర్ ఇంజిన్లు, టార్పాలిన్లను హరిజన, గిరిజన, బడుగు బలహీన వర్గాల రైతులకు మంగళవారం అందించారు. 90 శాతం సబ్సిడీతో అందించిన వీటిద్వారా కొన్ని వందల కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా ఉన్నారని, మరోమారు ఈ విషయాన్ని జగనన్నతో మాట్లాడుతానని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు ఎండయ్య మాట్లాడుతూ.. 25 ఏళ్లు ఎమ్మెల్యేగా పాతపట్నం నియోజకవర్గాన్ని పరిపాలించిన టీడీపీ నాయకుని పేరు కూడా గిరిజనులకు తెలియదని.. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రెడ్డి శాంతి మండలంలోని అందరికీ తెలుసన్నారు. వాటర్ షెడ్ అడిషనల్ పీడీ జయరాం, తహసీల్దార్ సరోజిని, ఏపీఓ రవి, స్థానిక సర్పంచ్ కావేరి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉదయ్‌కుమార్, యోగి, నక్క బాబూరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బాలరాజు, సవర వెంకటేష్, జయమునిరావు, సంజీవ్, గంట ఢిల్లీరావు, పాపారావు, కూర్మారావు, టి.ప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నరసన్నపేట ఎస్ఐగా అశోక్‌బాబు



నరసన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్ఐగా వి.అశోక్‌బాబును జిల్లా ఎస్పీ నియమించారు. ప్రస్తుతం బూర్జలో ఎస్ఐగా పనిచేస్తున్న అశోక్‌బాబు బదిలీపై నరసన్నపేట రానున్నారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఎస్ఐ అశోక్‌బాబు మంగళవారం తెలిపారు. ఇప్పటివరకు నరసన్నపేటలో ఎస్ఐగా పనిచేసిన వై.సింహాచలం విశాఖపట్నం జిల్లాకు బదిలీ అయింది.

రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) నుంచి పంట పండించేందుకు భూములపై రుణాలు తీసుకున్న రైతులు ఫిబ్రవరి 25వ తేదీలోగా రుణాలు చెల్లించి రెన్యువల్ చేయించుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఫిబ్రవరి 25వ తేదీలోగా రుణాలు చెల్లించిన వారికి 7 శాతం వడ్డీ మాత్రమే చెల్లించటం జరుగుతుందన్నారు. గడువు దాటితే రూ.13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. రుణాలు తీసుకున్న వారంతా గడువులోగా రుణాలు చెల్లించాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఎల్.ఎన్.పేట: జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని గృహనిర్మాణ శాఖ ఏఈ కె.రమేష్ సూచించారు. మండలంలోని దబ్బపాడు, తురకపేట, పెద్దకొల్లివలస, బొత్తాడసింగి, సుమంతాపురం గ్రామాల్లో కాలనీ ఇళ్ల నిర్మాణం పనులను మంగళవారం పరిశీలించారు. ఫిబ్రవరిలో గృహ ప్రవేశాలు చేసేందుకు సిద్ధం కావాలని లబ్ధిదారులకు సూచించారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. బిల్లులు చెల్లించేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, ఇప్పటివరకు నిర్మాణం చేసిన స్థాయిలకు బిల్లులు చెల్లించటం జరిగిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని కొల్లివలసలో గల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో (బాలురు) 5 తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ నూక రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

2024–25 విద్యా సంవత్సరానికి (ఇంగ్లిష్ మీడియం) ప్రవేశానికి సంబంధించి ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. ఈ నెల 25 నుంచి ఫిబ్రవరి 23 వరకు అన్‌లైన్లో దరఖాస్తు చేయాలన్నారు. పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు. మార్చి 10వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్‌మీడియెట్ మొదటి సంవత్సర విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

తామరాపల్లి గురుకులంలో..

నరసన్నపేట: మండలంలోని తామరాపల్లి శివార్లులో ఉన్న బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు గురుకులాల సమన్వయ అధికారి బాలాజీ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఇంటర్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 23 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని, పూర్తి వివరాలకు కళాశాల ప్రిన్సిపాల్‌ను సంప్రదించవచ్చన్నారు. మార్చి 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇంటర్‌మీడియెట్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేవారి వయస్సు 2024 ఆగస్టు 31 నాటికి 17 ఏళ్లు మించరాదన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష రాస్తున్నవారు మాత్రమే అర్హులని తెలిపారు.

మహాత్ముని బాటలో పయనిద్దాం

మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో గాంధీజీ వర్ధంతి పురస్కరించుకుని ఆయన విగ్రహాలు, చిత్రపటాల వద్ద మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గాంధీజీ శాంతి మార్గంలోనే స్వాతంత్య్రం సంపాదించారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పాతపట్నం: కోర్టు కూడలిలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: కేజీబీవీలో గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులు



పాతపట్నం: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీజీ వేషధారణలో విద్యార్థి



సరుబుజ్జిలి: ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కళాశాల సిబ్బంది



సారవకోట: గ్రంథాలయం వద్ద మహాత్ముని విగ్రహానికి పూలమాల వేస్తున్న లైబ్రేరియన్



ఆమదాలవలస: గాంధీజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఆర్యవైశ్య సంఘం గౌరవ సభ్యులు

రొట్టవలస విద్యార్థుల ప్రతిభ

సరుబుజ్జిలి: ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో వాలీబాల్ విభాగం నుంచి రొట్టవలస హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం దక్కించుకున్నారు. విజేతలకు పాఠశాల ఆవరణలో హెచ్ఎం కె.రామకృష్ణారావు మంగళవారం బహుమతులు అందించి అభినందించారు. క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. అధ్యాపకులు, పీడీ అప్పయ్య పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం రామకృష్ణారావు

సమస్యలు పరిష్కరించాలని వినతి

మెళియాపుట్టి: ఉపాధి హామీలో గత 16 ఏళ్లుగా క్షేత్రస్థాయిలో పనులు చేస్తూ చాలీచాలని వేతనాలతో ఇబ్బందులకు గురవుతున్నామని, తమ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతికి మంగళవారం కుద్దబ గ్రామంలో ఉపాధి క్షేత్రసహాయకులు వినతి పత్రం ఇచ్చారు. వేతనాలు పెంచి, న్యాయబద్ధమైన కోర్కెలను తీర్చాలన్నారు. యూనియన్ మండల అధ్యక్షుడు భాస్కరరావు, ఉపాధ్యక్షుడు జగదీశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు సింహాచలం, రాజు మజ్జి, వనజాక్షి, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

26 మద్యం సీసాల స్వాధీనం

పాతపట్నం: స్థానిక రైల్వే స్టేషన్ వద్ద ఉన్న గేటు సమీపంలో ఎస్ఐ మహమ్మద్ యాసీన్ ఆధ్వర్యంలో మంగళవారం వాహన తనిఖీలు నిర్వహించారు. టెక్కలి గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి నుంచి అమ్మవారి ఆలయం వైపు ద్విచక్ర వాహనంపై 26 ఒడిశా మద్యం బ్యాటిళ్లను తీసుకువస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. మద్యం విలువ రూ.3,420 ఉంటుందన్నారు. బ్యాటిళ్లను స్వాధీనం చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. ఇద్దరుపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.







